అధ్వానంగా పారిశుధ్యం


అనంతవరం పంచాయతీలో పూడిపోయిన డ్రైనేజీ


కొత్తపల్లికొరగుంటలో ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ


అనంతవరంలో డ్రైనేజీ లేక సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

దగదర్తి: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రైనేజీలు లేకపోవడం ..ఉన్నా పూడికతీతకు నోచుకోక మురుగు రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 20 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలోని డ్రైనేజీలపై పర్యవేక్షణ లేక చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడిపోయి ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు కొద్దిపాటి వర్షం పడినా డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరికొన్ని పంచాయతీల్లోని ఎస్సీ ఎస్టీ కాలనీల్లో అసలు మురుగు కాలువలే నిర్మించలేదు. ప్రతి పంచాయతీలో మురుగు నీటి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నా సంబంధిత అధికారులు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని, ఇంకా మంజూరు కాలేదని చెబుతున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని, కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ఊదరగొడుతోంది. కానీ గ్రామాల్లోని పరిస్థితి చూస్తే పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వం ఇటీవల హర్ ఘర్ తిరంగా కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామంలో పంచాయతీ సభ్యులు, సచివాలయ అధికారులు ప్రజలతో కలిసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ ఆదేశాలు ఇచ్చారు. అయినా ఇప్పటికీ పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని, రోడ్లపై నిలిచిన మురుగునీరు దుర్గంధం వెదజల్లుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, సచివాలయాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుని రోగాల బారిన పడకుండా రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నులి పురుగులతో రక్తహీనత


సంగం: గురుకులంలో విద్యార్థినితో అల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ


కలిగిరిలో..

సంగం : నులి పురుగులతో చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతుందని, వాటి నివారణకు అల్బెండజోల్ మాత్రలను ఏడాదికి రెండుసార్లు తప్పనిసరిగా మింగించాలని జిల్లా అదన వైద్యాధికారి, ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక బాలిక గురుకుల పాఠశాలలోని 596 మంది విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్ఓ మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల నులిపురుగులు ఏర్పడుతాయని తెలిపారు. ఆహారాన్ని తినేముందుగా చేతులను శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. సంగం పీహెచ్‌సీ వైద్యాధికారులు బీ శ్రీనివాసులరెడ్డి, డీ అశోక్, ఆరోగ్య విస్తరణాధికారి మల్లెంకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులతో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి అస్మా స్వయంగా మాత్రలు మింగించారు. మున్సిపల్ పరిధిలో 11,846 మంది విద్యార్థులకుగానూ 11,634 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

చేజర్ల(సోమశిల): చేజర్ల పీహెచ్‌సీ వైద్యులు మోహతాబ్, అంశుధర్ ఆధ్వర్యంలో చేజర్ల మండలంలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు మధ్యాహ్నం భోజనానంతరం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు

ఉదయగిరి రూరల్: గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం శివకల్పన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని 6,764 మంది చిన్నారులకు గానూ 6,623 మందికి మాత్రలు అందజేసినట్లు ఆమె తెలిపారు.

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ జీ గోపిశ్రీనివాసులు, సీహెచ్ఓ రాజశేఖర్ విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు.

కలిగిరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

సీతారామపురం : మండలంలో 1 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు 3,504 మందిని గుర్తించగా, 3,434 మందితో మాత్రలను మింగించామని సీతారామపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

పుట్టాలమ్మకు పొంగళ్లు



అనుమసముద్రంపేట: మండలంలోని తెల్లపాడులో గ్రామదేవత పుట్టాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా చెరువు వద్ద ఉన్న పుట్టాలమ్మ గుడి వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడమని అమ్మవారిని వేడుకున్నారు.

సామూహిక కుంకుమార్చన



సంగం: శ్రావణమాసం మూడో మంగళవారాన్ని పురస్కరించుకుని అన్నారెడ్డిపాళెంలోని పోలేరమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పోలేరమ్మకు పల్లకిసేవ జరిపారు.

మద్యం దుకాణ తనిఖీ

సీతారామపురం : మండలంలోని మద్యం దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై కాలేషా మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలని, బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గం రోడ్డు నిర్మాణంపై పరిశీలన



ఉదయగిరి: ఉదయగిరి- దుర్గంపల్లి రహదారి నుంచి దుర్గం మెట్ల మార్గం వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి మండలాధికారులు మంగళవారం పరిశీలన చేశారు. ప్రభుత్వ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాలు, పురావస్తు, సర్వే శాఖల అధికారుల సంయుక్తంగా పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. రేంజ్ అధికారి బీఎస్ కుమార్‌రాజా, ఆర్‌అండ్‌బీ జేఈ ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

సంగం: కొరిమెర్లలో అట్రాసిటీ కేసుపై నెల్లూరు అట్రాసిటీ సెల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. కొరిమెర్లలోని మామిడితోటలో పనిచేస్తున్న తనపై తోట యజమాని స్నేహితులతో కలిసి మద్యం తాగి లైంగిక దాడికి పాల్పడ్డాడని గిరిజన మహిళ ఈ నెల 3వ తేదీన సంగం పోలీసులకు ఫిర్యాదు చేయగా లైంగికదాడితో పాటు అట్రాసిటీ కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కొరిమెర్లలోని మామిడితోటలో గిరిజన మహిళను అట్రాసిటీ డీఎస్పీ విచారించారు. ఆయన వెంట ఎస్సై రాజేష్ ఉన్నారు.

యువతి అదృశ్యం

దుత్తలూరు: మండలంలోని బండకిందపల్లి కంకర క్వారీ వద్ద పనిచేస్తున్న ఓ యువతి అదృశ్యమయ్యారు. వివరాలు.. కంకర క్వారీ వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం పనిచేస్తోంది. వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన యువతి తన తల్లితో కలిసి అక్కడే పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతి, ఇద్దరు యువకులు సోమవారం నుంచి అదృశ్యమయ్యారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆదిలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి



ఆత్మకూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదాని కంపెనీకి అమ్ముడుపోయి ప్రజలను దోచుకునేందుకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆత్మకూరులోని సోమశిలరోడ్డు సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత కరెంట్‌ను ఎత్తేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, షేక్ సందానీ, నాగయ్య, వీ శ్రీహరి, గుల్జార్‌బేగం, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథన్‌కు నివాళి

సోమశిల: అనంతసాగరంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి లైబ్రేరియన్ దివానపు నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రంగనాథన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠకులు ఎం శేషయ్య, ఎం కష్టారెడ్డి పాల్గొన్నారు.

స్టేడియం స్థల పరిశీలన


స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: పట్టణ సమీపంలో గండిపాళెం వెళ్లే మార్గంలోని స్టేడియం స్థలాన్ని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి యతిరాజ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఉదయగిరిలో స్టేడియం నిర్మాణానికి సర్వే నంబర్లు 483/2ఏ, 483/2బీలో 2.75 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. అందులో కావలి-సీతారామపురం జాతీయ రహదారి నిర్మాణానికి 0.66 ఎకరాలను సేకరించగా పరిహారం కూడా చెల్లించారని చెప్పారు. మిగిలి ఉన్న 2.09 ఎకరాల స్థలాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజల కోసం క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

బరితెగించిన టీడీపీ, జనసేన నేతలు

- వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి
- బోడిగుడిపాడులో ఉద్రిక్తత


గాయపడిన తిరుపతయ్య, సీతమ్మ

దగదర్తి: మండలంలోని బోడిగుడిపాడులో సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు కూటమి పార్టీల నేతలు కుట్ర పన్నారు. ఇదే విషయమై జరిగిన ఘర్షణలో వ్యక్తిపై టీడీపీ, జనసేన వర్గీయులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు, బంధువుల సమాచారం మేరకు.. ఓ సామాజికవర్గానికి చెందిన వారిని టీడీపీ, జనసేనకు చెందిన వెంకటరమణయ్య, శ్రీహరి దుర్భషలాడుతూ.. బెదిరిస్తూ.. కించపరచసాగారు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న ఐస్ బండి వద్దకు ఇద్దరు పిల్లలు రెండు రోజుల క్రితం వెళ్లారు. ఇదే సమయంలో అక్కడ ఉన్న వీరు.. రోడ్డుపై ఐస్ బండిని ఎలా ఆపుతావని ప్రశ్నించారు. దీనిపై వీరిని మల్లి తిరుపతయ్య, వృద్ధురాలు సీతమ్మ నిలదీశారు. ఈ తరుణంలో తిరుపతయ్యను దుర్భాషలాడుతూ.. వృద్ధురాలిని కర్రలతో చితకబాదారు. తాజాగా తన పొలంలో వ్యవసాయ పనులను మల్లి తిరుపతయ్య మంగళవారం చేసుకుంటుండగా, శ్రీహరి, వెంకటరమణయ్య మరో ఇద్దరు కలిసి కర్రలు, కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. సమీపంలో ఉన్న ఇతర రైతులు అడ్డుకునేందుకు యత్నించగా వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన తిరుపతయ్యను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు తమ ఫిర్యాదులను పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఆలయ చైర్మన్ల నియామకం

సంగం: వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా పగడాల రఘురామయ్య, మర్రిపాడులోని చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్‌గా మందిపాటి శ్రీహరిరెడ్డిని నియమించినట్లుగా దేవదాయశాఖ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

దళిత, గిరిజనుల హక్కుల కోసం పోరాటం



అనుమసముద్రంపేట: దళిత, గిరిజనుల హక్కుల కోసమే తమ పోరాటమని దళిత, గిరిజన జేఏసీ రాష్ట్రాధ్యక్షుడు పాలకీర్తి రవి పేర్కొన్నారు. ఏఎస్ పేటలో మంగళవారం నిర్వహించిన దళిత, గిరిజన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ జేఏసీ ద్వారా కొత్తగా మైనార్టీల హక్కుల సాధన కోసం పోరాటాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అందులో భాగంగా గ్రామస్థాయి నుంచి మైనార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దళిత, గిరిజన, మైనార్టీలు పార్టీలకు అతీతంగా తమ దృష్టికి సమస్యలను తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం దళిత, గిరిజన జేఏసీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా షేక్ రఫీ, మండలాధ్యక్షుడిగా ఖాజాహుస్సేన్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సముద్రాల దావీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు చల్లా మాధవి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

సోమశిల: గృహ నిర్మాణా లను వేగవంతం చేయా లని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆదేశించారు. మంగళవారం ఆయన పంచాయతీకార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న గృహనిర్మాణాలను పరిశీలించి పురోగతిలో ఉన్నవాటి లబ్ధిదారులకు బిల్లులు త్వరితగతిన వచ్చేలా చూడాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య పాల్గొన్నారు.

హర్ ఘర్‌కా తిరంగా ర్యాలీ



కలిగిరి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కలిగిరిలో తహసీల్దార్ గిరీష్ ఆధ్వర్యంలో హర్ ఘర్‌కా తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై విద్యార్థులతో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతకాన్ని ఎగురవేయాలని కోరారు.

అంగన్‌వాడీల ఆందోళన



ఉదయగిరి రూరల్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రజియా మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్లలో ఇంటర్నెట్ సక్రమంగా రాక యాప్‌లు పనిచేయడం లేదన్నారు. దీంతో లబ్ధిదారులకు సరుకుల పంపిణీ, డేటా ఎంట్రీలో అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత ఫోన్ల స్థానంలో 5జీ సామర్థ్యం కలిగిన సెల్‌ఫోన్లు అందజేయాలని కోరారు. అప్పటి వరకు తాము రికార్డు వర్క్ మాత్రమే చేస్తామని తెలిపారు. అనంతరం పాత సెల్‌ఫోన్లను ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేశారు. సీపీఎం నాయకుడు కోడెల రమణయ్య, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారామపురం సెక్టార్ల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ల పరిశీలన

వింజమూరు(ఉదయగిరి)/సంగం: వింజమూరులోని ఆర్టీసీ బస్టాండ్‌ను నెల్లూరు రీజయన్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ శివకేశవ్‌ను ఆదేశించారు. బస్టాండ్ స్థలంలోని ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు అనువుగా మార్చాలని సూచించారు. ఆయనతో పాటు బీజేపీ నేతలు యల్లాల రఘురామిరెడ్డి,ఏఈ శోభన్ తదితరులు ఉన్నారు. అలాగే సంగంలోని బస్టాండ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. బస్టాండ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ సోమ్లానాయక్‌తో మాట్లాడి స్థల వివరాలను తెలుసుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించి గ్రామస్తుల సహకారంతో త్వరలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

బీమా పథకాలపై అవగాహన



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గూటియా మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. చిన్న మొత్తాన్ని ప్రీమియంగా చెల్లిస్తే ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే భారీగా పరిహారం అందుతుందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ బీఎస్ఎన్ స్వామి, స్థానిక బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సగటు ధర రూ.216

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు సగటు ధర 216.56 పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 654 బేళ్లు రాగా, 289 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.140, సగటున రూ.216.56 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280 ధర పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 209 బేళ్లను తీసుకురాగా, 152 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.140, సగటున రూ.192.44 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీ ధ్వంసంపై దుమారం


ఫ్లెక్సీని ట్రాక్టర్‌తో ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్త సుబ్బరాయుడు

కలిగిరి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫ్లెక్సీని టీడీపీ కార్యకర్త ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన వీడియో సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ కావడం దుమారం రేపింది. మండలంలోని ఎరుకులరెడ్డిపాళెంలో ఈ నెల 3న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యకమం నిర్వహించారు. గ్రామానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ తన సొంత నిధులతో పాటు గ్రామస్తుల నుంచి కొంత విరాళాలు సేకరించి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. ఈ నెల 2న విగ్రహ ఏర్పాటులో భాగంగా ఖాజామస్తాన్ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. అందులో గ్రామానికి చెందిన ఒక వర్గం నాయకుల ఫొటోలను వేయలేదు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తోకల సుబ్బరాయుడు గ్రామస్తుల సహకారంతో విగ్రహ ప్రతిష్ఠ చేస్తూ ఎమ్మెల్యేలు, కొంత మంది నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఎలా ఏర్పాటు చేస్తారని ఖాజామస్తాన్‌తో విగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో తన శనగ నూర్పిడి మిల్లర్ ట్రాక్టర్‌తో కట్టడానికి సిద్ధంగా ఉన్న ఫ్లెక్సీని ధ్వంసం చేశాడు. గ్రామంలోని టీడీపీలో ఉన్న వర్గ విభేదాల నేపథ్యంలో ఫ్లెక్సీని ధ్వంసం చేసిన వీడియో వైరల్ కావడం విశేషం. కాగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫ్లెక్సీని ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్త సుబ్బరాయుడుపై ఫిర్యాదు చేసినా ఎలాంటి కేసులు లేకుండా పంపినట్లు సమాచారం. మండలంలోని టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గీయులుగా విడిపోయారు. ఈ నేపథ్యంలో వారి మధ్యన విభేధాలు తారాస్థాయికి చేరినట్లు సమాచారం.

బస్సుల కండీషన్ మెరుగునకు చర్యలు

ఉదయగిరి: జిల్లాలో ప్రజా రవాణా సంస్థ బస్సుల కండీషన్ మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీటీఎం రమేష్ అన్నారు. మంగళవారం ఆయన ఉదయగిరి డిపోను సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్న నేపథ్యంలో డిపోను సందర్శించి బస్సులు కండీషన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. చీఫ్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఏఎంఎఫ్ నాగరత్నం, సూపర్‌వైజర్ రమణయ్య, హజరత్తయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ ధర్నా

ఉదయగిరి రూరల్: ప్రజారవాణా శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరి డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకుడు సలాం మాట్లాడుతూ విజయవాడలోని గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల విలువైన స్థలాన్ని లులు అనే ప్రైవేట్ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ డిపోను తరలింపును ఆపాలన్నారు. ప్రజారవాణా శాఖ ఉద్యోగులకు ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.